# ఆత్మీయ అభివృద్ధి ఎదురుచూడబడెను

## Spritual Growth Expected

**పాఠ్యోద్దేశము** : ప్రతి సంఘ సభ్యునిలో ఫలమునకు సంబంధించి, పరలోక శక్తుల సమూహములు మరియు భూమిపై నున్న దేవుని ప్రజలు ఎలా ఏకమైయున్నారో చూపించుట.

**లేఖనము** : లూకా 13:6-9

## ఉపమానము చదువుట కొరకైన చారిత్రక విశ్లేషణ

**స్థలము** : గలిలయ (లూకా 13:1).

**సందర్భము** : దేవుని రాజ్యము యొక్క జీవితమును ప్రకటించు సందర్భము.

**సమయము** : యేసు తన యొక్క మూడున్నర సంవత్సరముల సువార్త మరియు బోధనా పరిచర్యను బట్టి సంతోషముగా నుండెను. వేలాది మంది ప్రజలు ఆయన బోధలు వినుటకు వచ్చుచుండిరి (లూకా 12:1). తరువాత యేసు "యెరూషలేము నకు ప్రయాణమై పోవుచు.... సంచారము చేయుచుండెను," యోహాను నమోదుచేసిన ప్రయాణములలో ఇది ఒకటి (లూకా 13:22).

**శ్రోతలు** : సామాన్యముగా వచ్చు ప్రజలైయున్నారు కాని యేసు శిష్యులతో పాటుగా ఎక్కువగా గలిలయులైయున్నారు.

**ఉద్దేశము** : యేసు ఈ ఉపమానమును "ముసలమ్మ ముచ్చట్ల"కు ప్రత్యు త్తరముగా చెప్పెనని, స్పష్టమగుచున్నది, లూకా 13:1-5 చూడుము. ప్రజలకు ఏదైన చెడు సంభవించినట్లయితే వారు ఖచ్చితముగా హెచ్చు పాపులై యుందురని విశ్వసించు ప్రజలై యున్నారు. యేసు వారియొక్క మూఢనమ్మకముల సంబంధమైన భయములకు సత్యముతో ప్రత్యుత్తరమిచ్చెను. ప్రజలందరు పాపులై యున్నారు మరియు మనము మారుమనస్సు నొంద వలెను లేదా మనము కూడా నశింతుము. క్రైస్తవుని కొరకైన మారుమనస్సు అనగా అర్థము మనము మన మనస్సును మార్చుకొంటిమి మరియు మనము ఇప్పుడు దేవుని రాజ్యము కొరకైన ఫలమును ఫలించుటకుసిద్ధముగా నున్నాము. "మారు మనస్సుకు తగిన ఫలములు ఫలించుడి" అని చెప్పిన బాప్తీస్మమిచ్చు యోహాను యొక్క హెచ్చరికకు యేసు సమ్మతించెను (లూకా 3:8).

## పాఠము

*మరియు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను - ఒక మనుష్యుని ద్రాక్షాతోటలో అంజూరపు చెట్టొకటి నాటబడియుండెను. అతడు దాని పండ్లు వెదకవచ్చినప్పుడు ఏమియు దొరకలేదు. గనుక అతడు - ఇదిగో మూడేండ్ల నుండి నేను ఈ అంజూరపు చెట్టున పండ్లు వెదకవచ్చుచున్నాను గాని యేమియు దొరకలేదు దీనిని నరికివేయుము, దీనివలన ఈ భూమియు ఏల వ్యర్థమైపోవలెనని ద్రాక్షాతోటమాలితో చెప్పెను. అయితే వాడు -అయ్యా, నేను దాని చుట్టు త్రవ్వి, యెరువు వేయు మట్టుకు ఈ సంవత్సరము కూడ ఉండనిమ్ము అది ఫలించిన సరి, లేనియెడల నరికించి వేయుమని అతనితో చెప్పెను.* *లూకా 13:6-9.*

## దేవుడు ఫలమును ఆశించుచున్నాడు

పాపులు "లోకమునందు" అను పరిధి నుండి "క్రీస్తునందు" అను పరిధిలోనికి "పిలువబడిన" వారైయున్నారు, "క్రీస్తునందు" అను పరిధి దేవుని యొక్క ద్రాక్షాతోట గల ప్రదేశమై (పరిధియై) యున్నది (యోహాను 18:36; కొలొస్స 1:12,13; అపొ. కార్య. 26:18). క్రైస్తవులు "బయటకు పిలువబడిన" వారైయున్నారు లేదా సంఘమై యున్నారు. తిరిగి జన్మించిన తరువాత, మనము క్రీస్తు యొక్క శరీరముగా పనిచేతుము (ఎఫెసీ; 1:19-23; కొలొస్స. 1:18). క్రీస్తు యొక్క శరీరము "ప్రతీ కీలు (సభ్యుడు) వలన గలిగిన బలముచేత అతుకబడి" యున్నది. ఎఫెసీ 4:16. అంజూరపుచెట్టు వ్యక్తిగతముగా క్రైస్తవునకు గురుతుగానున్నది. అయితే, మనము శరీరమునందలి మన స్థానములో ఫలమును ఫలించుటకు పని చేయుదుము (రోమా 12:4-8; 1 కొరింథీ. 12:12-26). దేవుడు ప్రతి క్రైస్తవుని నుండి ఫలమును ఆశించుచున్నాడు. అందుచేత, మన స్వాస్థ్యమును పొందుటకు నిరీక్షించు ప్రతి క్రైస్తవుడు తప్పక నాల్గవ నేలగా నుండవలెను. రెండవ భాగము, మొదటి పాఠము చూడుము. యేసు సంఘ టితముగా సంఘము నుండి ఫలమును ఆశించు చున్నాడు. అయితే, యే ఒక్క సభ్యుడు ఫలములను ఫలించుట నుండి మినహాయించబడలేదు. 1 థెస్స. 1:8,14 (సంఘటితముగా సంఘమునకు సంబంధించినది). 5:4-11 (వ్యక్తి గతముగా ప్రతి క్రైస్తవునకు సంబంధించినది) చూడుము.

వ్యవసాయదారుడు తన ఫలమును గూర్చి ఆలోచించుట ప్రారంభించుటకు ముందు అతడు ప్రణాళిక సిద్ధము చేసుకోవలెను మరియు కాలసిన యేర్పాటులను చేసుకొనవలెనని ఎరుగును. అలాగే, దేవుని యొక్క సంకల్పము నిత్యత్వము నందు జగత్తు పునాది వేయబడక మునుపే సిద్ధముచేసెను (ఎఫెసీ.1:3-6; 1 కొరింథీ. 2:7; 1 పేతురు 1:17-21). ఈ అంత్యదినములలో రాజుగా / యాజకునిగా పరిపాలించుటకు (యేలుటకు) తన కుమారుడైన యేసుక్రీస్తుకు ప్రభుత్వము మరియు అధికారము ఇచ్చినప్పుడు ఆయన యొక్క చివరి ఏర్పాటు జరిగెను. (మత్తయి 28:18;

అపో. కార్య. 2:17,36, 5:31; 1 కొరింథీ. 15:22-28). యేసునకు సహాయము చేయుటకు దేవుడు పరిశుద్ధాత్మను కూడా యేర్పాటుచేసెను. అత్యంత వ్యక్తిగతముగా ఆలోచించిన, ఫలమును పొందుట కొరకు భౌతిక ఇశ్రాయేలు నుండి రాజ్యమును తీసివేసిన తరువాత దేవుడు చేసిన యేర్పాటు యేసుక్రీస్తు అయియున్నాడు. మొదటి భాగము, మొదటి పాఠము చూడుము. యేసు యేమిచేసెనో, మరియు ఇప్పుడు యేమి చేయుచున్నాడో అది దేవుని యొక్క యేర్పాటైయున్నది. ఇది దేవుని కొరకు కుమారులను రూపొందించు సామర్థ్యము గల ఒకేఒక్క ద్రాక్షాతోటయై యున్నది మరియు ఆయన తిరిగి వచ్చునప్పుడు దేవునికి యేసు తీసుకొనివచ్చు ఒకే ఒక్క ఫలము ఇదే (హెబ్రీ. 2:10).

*నాయందు నిలిచి యుండుడి, మీయందు నేనును నిలిచి యుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి యుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనేకాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలచియుండునో నేను ఎవనియందు నిలచి యుందునో వాడు బహుగా ఫలించును నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు.*

*యోహాను 15:4,5.*

దేవుడు సంకల్పించి తన ద్రాక్షాతోటను బాగుగా సిద్ధము చేసెను. ఇప్పుడు వ్యక్తిగతముగా ప్రతి క్రైస్తవునకు గురుతుగానున్న అంజూరపు చెట్టును గూర్చి మనము చర్చించుదము. క్రైస్తవులు దేవుని యొక్క పనియైయున్నారు మరియు ఆయన వ్యవసాయమైయున్నారని లేఖనములు గుర్తించుచున్నవి (ఎఫెసీ. 2:10; 1 కొరింథీ. 3:9). క్రైస్తవుని యొక్క లక్ష్యము దేవునిని పోలి నడచుకొనుటైయున్నది (ఎఫెసీ 5:1). ఫలితముగా, మనము ".... ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు.... (మనము) వెలుగు సంబంధులవలె నడచుకొనుడి (వెలుగు సంబంధమైన ఫలము సమస్త మంచి తనమును మరియు నీతిని మరియు సత్యమును కలిగియున్నది), ప్రభువునకేది ప్రీతికరమైనదో దానిని నేర్చుకొనుటకు (మనము) ప్రయత్నించు చున్నాము" (ఎఫెసీ 5:8-10).

మనము దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసుకొనుచు, శరీరము నకును, ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసుకొనవలెనని దేవుడు ఆశించుచున్నాడు (2 కొరింథి 7:1). అపొస్తలుడైన పేతురు మనలను మన మనస్సులను చురుకుగా నుంచుకొనవలెనని, నిబ్బరమైన బుద్ధిగల వారమై యుండవలెనని, మన నిరీక్షణపై మనస్సు నిలుపవలెనని మరియు పరిశుద్ధులుగా రూపొందవలెనని హెచ్చరించుచున్నాడు (1 పేతురు 1:13). మనలను మనము విశ్వాసమునందు వున్నట్లు చూచుకొనుటకు మనము పరీక్షించుకొనవలెను మరియు గమనించు కొనవలెను. మనలో యేసు యొక్క దైవస్థితిని కనుగొనలేక పోయినట్లయితే, మనము పరీక్షలో విఫలమవుదుము (2 పేతురు 1:4). మనము "బహుమానము పొందునట్లుగా పరుగెత్త"క పోయినట్లయితే దేవుడు కోరుచున్న ఫలమును ఒక క్రైస్తవుడు ఫలించలేడు. (1 కొరింథి. 9:24).

క్రైస్తవులు రాజ్య సంబధమైన ఆశీర్వాదములన్నిటిని తప్పక కలిగియుండవలెను అప్పుడు మనము సరియైన ఆత్మీయ మరియు మానసిక వాతావరణము కలిగి యుందుము. ఆదాము, హవ్వలు దేవుని యొక్క నిబంధనను గైకొనినంతకాలము ఏదెను తోట ఆత్మీయ, మానసిక మరియు భౌతికమైన వాతావరణమును సరియైన విధానములో కలిగియున్నది. అక్కడ భయములేదు. ఎందుచేతననగా అక్కడ మరణములేదు; అక్కడ ఎటువంటి దోషము లేదు, ఎందుచేతననగా వారునిబంధనను మీరుటచే పాపముచెయ్యలేదు మరియు అట్లు చేసి మంచి, చెడ్డల జ్ఞానమును పొందలేదు. దేవుడు వారి యొక్క వాతావరణమునకు మరియు మనయొక్క ఆత్మీయ వాతావరణమునకు సమానమైన ప్రాముఖ్యతను కల్పించెను, దేవుని ఉనికి యుండెను. ఇటువంటి వాతావరణమునందు మన ప్రభువు యొక్క ఆజ్ఞలకు సరియైన రీతిలో లోబడుదుము. క్రీస్తునందు వున్న ఆశీర్వాదములు, మన విశ్వాసపూర్వకమైన విధేయత కలిసి, ఆరంభమునందలి "ఏదెను వనము" యొక్క ఆత్మీయ వాతావరణమును మరియు దేవుడు ఆశించు ఫలమును అందించును. ఆ రాజ్యము క్రైస్తవులను "బాల్య స్థితి" నుండి సంపూర్ణమైన ఫలమును ఫలించుటకు తీసుకొని వచ్చునట్లు రూపొందించ బడెను.

*ప్రభువు దయాళుడని మీరు రుచిచూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమును పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి.* *1 పేతురు 2:1-3.*

దేవుడు ఆశించు ఫలము సంఘములకు వ్రాయబడిన ప్రతీ పత్రికయందు అదేవిధముగా యేసు యొక్క బోధలయందు వెల్లడిచేయబడెను. గలతీ 5:22,23 అత్యంత తరచుగా ఎత్తి చెప్పబడెను. ఈ తొమ్మిది లక్షణములన్నియు యేకకాలము నందు ఫలము కొరకైన అర్హతకు యేకము చేయబడెను. కొలస్సయులకు వ్రాసినపత్రిక ఈ క్రైస్తవులకు అంధకార సంబంధమైన అధికారము క్రిందవున్న వారియొక్క స్థితిని వెల్లడిచేయుచున్నది (కొలొస్స 1:13, 3:5-7). ఈ పత్రిక వారు రాజ్యములోనికి బదిలీ అయిన తరువాత వారు చేసుకొనవలెనని ఆశించిన మార్పులను గూర్చి కూడా వెల్లడి చేయుచున్నది (కొలొస్స. 3:8-15). అపొస్తలుడైన పౌలుచే పేర్కొన్న మరిన్ని హెచ్చరికలు 1 థెస్స. 4:1-12; ఫిలిప్పీ. 2:1-4, 14-16; 4:8,9 నందు కనుగొనబడును. ప్రేమ పులిసిన పిండివంటిదని గమనించవలెను, అది మొత్తమంతటినీ పులియజేయును. క్రైస్తవులు సహోదరప్రేమను మరియు తల్లిదండ్రుల ప్రేమ (గ్రీకునందు అగాపె)ను అభ్యసించవలెను. 2 పేతురు 1:7 చూడుము.

## నిష్ఫలమగు స్థితి
## (ఫలములు ఫలించని స్థితి)

మన అంశము నందలి ఉపమానము, మూడు సంవత్సరముల నుండి ఫలములను ఫలించని చెట్టును గూర్చి తెలియజేయుచున్నది. ఆత్మీయ అన్వయింపు నందు, ఇది "మూడవనేల"గా లెక్కించబడిన వ్యక్తియైయున్నది. రెండవ భాగము నందలి మొదటి పాఠము చూడుము. ద్రాక్షాతోట యజమానుని యొక్క ప్రతిస్పందన "దీనిని నరికివేయుము, దీని వలన ఈ భూమియు ఏల వ్యర్థమైపోవలెనని ద్రాక్షా తోటమాలితో చెప్పెను". ఫలములు ఫలించని చెట్టు నేల నుండి, గాలి నుండి ఆహార పదార్థములను వినియోగించును, అట్లుచేసి ఫలములు ఫలించు సామర్థ్యము గల మిగతా చెట్లనుండి దోచుకొనుచున్నది. ఇది ఫలములు ఫలించని ఒక చెట్టును ఫలములను ఫలించు స్థానమునకు పెంచి పోషించుట ఖర్చుతో కూడుకున్నది మరియు కాలహరణమునకు చెందినది. హెబ్రీ గ్రంథకర్త ఫలములు ఫలించని వారిగా నుండుట చూచి హెబ్రీ క్రైస్తవులను పురికొల్పు తన ప్రయాసలో యేసు చెప్పిన సంగతిని యెరవు తెచ్చుకొనెను.

*ఎట్లనగా, భూమి తనమీద తరచుగా కురియు వర్షమును త్రాగి, యెవరి కొరకు వ్యవసాయము చేయబడునో వారికి అనుకూలమైన పైరులను ఫలించుచూ దేవుని ఆశీర్వచనము పొందును. అయితే ముండ్లతుప్పలును, గచ్చతీగెలును దానిమీద పెరిగిన యెడల అది పనికిరానిదని విసర్జింపబడి శాపము పొందతగినదగును. తుదకది కాల్చివేయబడును. హెబ్రీ 6:7,8*

ఇటువంటి నిష్ఫలమైన సభ్యునికి సంబంధించి చెయ్యబడిన మనవి వైపు మన దృష్టిని మళ్ళించుదము. "అయ్యా, నేను దానిచుట్టు త్రవ్వి, యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరము కూడా ఉండనిమ్ము" (లూకా 13:8). ఇక్కడ మనము ఆలోచించ వలసిన విషయము కేవలము ఫలమును ఫలించని క్రైస్తవుని పునరుద్ధరించుటకు దేవుని యొక్క ప్రణాళిక యేమిటి? నాల్గవనేల, రెండు మరియు మూడవ నేలలను ఫలములు ఫలించునట్లు ఎట్లు సహాయము చేయును? కొందరిని తిరిగి పురుద్ధ రించుట సాధ్యమైయున్నది కాని అందరినీ కాదు. హెబ్రీ గ్రంథకర్త ఒకస్థాయి ఆత్మీయ అభివృద్ధిని సాధించి మరియు తరువాత తొలగి పోయిన క్రైస్తవుని గూర్చి మాట్లాడు చున్నాడు. ఆయన ఈలాగు చెప్పెను, "మారుమనస్సు పొందునట్లు అట్టివారిని మరల నూతనపరచుట అసాధ్యము" (హెబ్రీ 6:4-6).

దేవత్వము ఫలమును ఫలించునట్లు మనకు సహాయము చేయుటకు వ్యక్తి గతముగా ప్రతి క్రైస్తవునితో పనిచేయుచున్నారు (2 కొరింథి. 13:14). నీతిమంతులైన క్రైస్తవులందరికి దేవుని యొక్క శక్తి అందుబాటులో వున్నది (1 పేతురు 3:10-12). యేసుక్రీస్తు సజీవులకును మరియు మృతులకును కూడ ప్రభువైయున్నాడు మరియు విశ్వాసుల కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు (రోమా 14:9; హెబ్రీ. 10:19-21). పరిశుద్ధాత్ముడు తాను అట్లు చేయునట్లు లోనికి అనుమతించు క్రైస్తవులందరి యందు నివసించును మరియు సహవాసము చేయును (1 కొరింథి. 6:19; 1 థెస్స. 4:8). అందుచేత మనము "సంఘమునందు ఫలమును ఫలించని వారికి సహాయము చేయుటయందు పరలోకము ఆసక్తిని కనుపరచుచున్నది" అని తెలుసుకొందుము.

క్రైస్తవుని పునరుద్ధరించుటకైన దేవుని యొక్క కార్యక్రమము సంఘమను కుటుంబము లేకపోతే నిలచిపోవును. నిష్ఫలమైన క్రైస్తవునికి కూడా బాధ్యతవున్నది. అతడు లేదా ఆమె మారుమనస్సు నొందవలెను అయితే, సంఘము వారిలోని ప్రవేశించి, సహాయము చేయవలెను. అది తమలో దేవుని యొక్క ఆత్మీయ శక్తి పని చేయుచున్న సభ్యులచే జరుగవలెను.

*సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనినయెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచి దారికి తీసుకొనిరావలెను. ఒకని భారముల నొకడు భరించి, యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి. గలతీ 6:1,2.*

*నా సహోదరులారా, మీలో ఎవడైనను సత్యము నుండి తొలగిపోయినప్పుడు మరి యొకడు అతనిని సత్యమునకు మళ్లించినయెడల పాపిని వాని తప్పు మార్గము నుండి మళ్లించువాడు మరణము నుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పి వేయునని తాను తెలిసికొనవలెను. యాకోబు 5:19,20.*

క్రైస్తవుడు నిష్ఫలుడై మరియు దేవుని యొక్క ఆశీర్వాదముల నుండి తొలగిపోయి నప్పుడు, వారు మారుమనస్సు పొందేంతవరకు అతనికి లేదా ఆమెకు దేవుడు సహాయము చెయ్యలేడు. ఇటువంటి క్రైస్తవుడు సహాయమునొందుటకు అతడు లేదా ఆమె తనకు తాను "ఎంతో దూరము వెళ్లిపోయి" యుండవచ్చును (యూదా 20-23). ఇక్కడే దేవుడు నిష్ఫలమైన క్రైస్తవుని పునరుద్ధరించుటకు మరియు రక్షించుటకు మిగతా క్రైస్తవులందరి ద్వారా పనిచేయును. విశ్వాసులైన సంఘసభ్యుల ద్వారా ఆత్మీయముగా బలహీనులైన క్రైస్తవులతో దేవుని యొక్క శక్తి మరియు పరిశు ద్ధాత్ముడు సంప్రదించును. యేర్పాటు చేయబడిన సంఘపెద్దలు ఈ అంశమునకు సంబంధించి ఖచ్చితమైన ఆజ్ఞను కలిగియున్నారు. అపొ. కార్య. 20:28-30; 1 పేతురు 5:1-4; హెబ్రీ 13:17 చదువుము. అయితే ప్రభువు ప్రతి క్రైస్తవునకు మన సహోదరులను ప్రేమించుటకు ఆజ్ఞఇచ్చెను. మనము, అతడు లేదా ఆమె తడబడినట్లయితే వారు మన నిత్యత్వపు కుటుంబము గనుక వారిని పునరుద్ధరించుటకు సహాయము చేయ వలెను. మనమందరము దేవుని వాక్యము అను అక్షయబీజముచే తిరిగి జన్మించితిమి (1 పేతురు 1:22-25).

కొందరు క్రైస్తవులు ఎప్పటికీ ఫలమును ఫలించు స్థితికి పునరుద్ధరించబడరు. కొన్ని స్థానిక సంఘములు తమ యొక్క బలహీనమైన సహోదరులను పునరుద్ధరించు పనిని చెయ్యవు. దేవుడు

నేరుగా కలుగజేసుకొనుననుటకు ఎటువంటి ఆధారములేదు. స్థానిక సంఘము యొక్క అశ్రద్ధను బట్టి ఒక ఆత్మ నరకములో పోవునట్లు నశించి పోవును. స్థానిక సంఘము తన పనిని చేసినట్లయితే, అటువంటి క్రైస్తవుడు ఫలమును ఫలించువానిగా అవ్వకపోయినట్లయితే, స్థానిక సంఘము బాధ్యురాలు కాదు. స్థానిక సంఘము తన పనిని చేసినప్పటికీ లేదా చెయ్యకపోయినప్పటికిని ఇంకను ఫలమును ఫలించని క్రైస్తవుడు పెరికి పారవేయబడును. ప్రభువు యొక్క సంఘము దేవునియొక్క ఆలయమై యున్నది మరియు ప్రతి క్రైస్తవుడు దేవుని కొరకు ఫలమును ఫలించుటకు తన సామర్ధ్యమునందు ప్రత్యేకమైన శ్రద్ధను కలిగియున్నాడు (1 కొరింథి 3:16,17). "నాల్గవనేల" అతిక్రమములచే పట్టబడిన వారిని తప్పక పునరుద్ధరించవలెను. ఎందు చేతననగా సంఘము నందు అట్లు చేయగలవారము మనము మాత్రమే (గలతీ 6:1,2). ఫలములు ఫలించని వారిగా మనమువున్నట్లయితే అతిక్రమములచే పట్ట బడుదుమని యేసు భావించుచున్న దానిని మన పాఠ్యాంశమునందలి యేసు చెప్పిన ఉపమానమునందలి ముఖ్యమైన సంగతిని ఖచ్చితముగా మనము తెలసికొనవలెను.

ఈ పాఠము ఒక స్థానిక సంఘమునందలి సభ్యునితో సహవాస నిరాకరణ చేయుచుండుటచే క్రమశిక్షణాచర్యను పాటించుటకు సంఘమునకు దేవుడు జారీచేసిన ఆజ్ఞతో కలవరము చెందరాదు. ఒక సహోదరునితో లేదా సహోదరితో సహవాసము చేయకుండుట అనగా పునరుద్ధరించుట అని అర్థము (1 కొరింథి 5:1-5; రోమా 16:17-19; తీతు 3:10,11; యూదా 4:10,16-18). సామాన్యముగా అబద్ధ బోధకులతో సహోదరులుగా సహవాసము చెయ్యకూడదు (2 యోహాను 9-11). "ఫలమును ఫలించని దానిని పెరికివేయు" బాధ్యత స్థానిక సంఘమునదికాదు. అది పరలోకమునందు జరుగును. "దానిచుట్టు త్రవ్వి మరియు దానిలో యెరువులు వేయు" పని స్థానిక సంఘమునకు ఇయ్యబడెను. ఆచరణాత్మక రీతిలో, నిష్ఫలమైన క్రైస్తవులు తమ్మును తామే పెరికివేసు కొందురు. వారు ఆత్మీయముగా అప్రయోజనకరమైయున్నారు మరియు సంఘము ద్వారా దేవుడు చేయు సహాయమునకు స్పందించరు. వారుఆత్మ సంబంధమైన బోధలకు స్పందించరు (1 కొరింథి 3:1).

భూమిపైనున్న దేవుని రాజ్యపౌరులు పరిశీలించబడుచున్నారను దానిని గూర్చి మనము నిరంతరము ఎరిగినవారమైయుండవలెను. పరలోకములో వున్న ప్రధానులు అధికారులు సంఘమును పరిశీలించుట ద్వారా దేవుని జ్ఞానమును అర్థము చేసు కొందురు (ఎఫెస్సీ 3:10). "దేవ దూతలు గమనించుచున్నారు" (1 కొరింథీ. 11:10). అపవాది గర్జించు సింహమువలె ఎల్లప్పుడు తిరుగులాడుచున్నాడు (1 పేతురు 5:8; 2 కొరింథీ. 2:11). అన్యులు దేవుని ప్రజలను గమనింతురు (1 పేతురు 2:12; ఫిలిప్పీ 2:15). నాల్గవనేల యైన క్రైస్తవులందరు మన జీవితము యొక్క ఫలముతో క్రీస్తు సువార్తను ప్రకటించవలెను. ఇటువంటి రీతిగనే మనము దేవునిని ఆరాధించ వలెను (రోమా 12:1,2).

## చర్చ కొరకైన ప్రశ్నలు

1. ఆత్మీయముగా, పాఠ్యాంశము నందలి ఉపమానము నందు ప్రతి ఒక వ్యక్తి దేనికి గురుతుగా వుండెను?
2. వ్యవసాయదారులు ఫలము కొరకు ఎదురుచూచుటకు ముందు యేమిచేయ నుద్దేశింతురు? దేవుడు యేమి చేయును?
3. ఎఫెసీ. 2:10, 5:1,9 చదువుము మరియు మన పాఠము యొక్క శీర్షికకు సంబంధించిన ఒక పేరాగ్రాఫ్‌ను వ్రాయుము?
4. ఫలములు ఫలించని సంఘసభ్యుని "కత్తిరించివేయుట" ఎట్లు దేవునికి న్యాయమై యున్నది?
5. కొందరు సభ్యులు పునరుద్ధరించబడరు, ఎందుకు?
6. ఫలములు ఫలించని సభ్యుడు ఆమె లేదా అతడు వ్యతిరేకముగా తమకు తామే ఎట్లు పనిచేయుచున్నారు?
7. ఫలములు ఫలించని సభ్యుని పునరుద్ధరించుటలో ఎందుకు కుటుంబమైయున్న సంఘము యొక్క సంరక్షణ అతిప్రాముఖ్యమై యున్నది?
8. ఫలములు ఫలించని సంఘసభ్యునికి సహాయము చేయుటకు పరలోక సంబంధమైన శక్తులు ఎట్లు పనిచేయును?
9. స్థానిక సంఘమును గమనించుచున్న వారిని పేర్కొనుము?
10. యేసు చెప్పిన ఉపమానము నుండి మనము నేర్చుకొనగలుగు పాఠములు యేమిటి?